క్లుప్తంగా

కమిషనర్‌కు అభినందనలు



మున్సిపల్ కమిషనర్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిల్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు మాట్లాడుతూ కమిషనర్ సేవలను కొనియాడారు.

అంజన్నను దర్శించుకున్న ఏపీఎస్పీ ఐజీ రామిరెడ్డి



అంజన్నను దర్శించుకున్న అధికారులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని శనివారం ఏపీఎస్పీ ఐజీ జీవీ రామిరెడ్డి, సీఐడీ డీఎస్పీ శివారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు. స్వామి వారి ప్రసాదాలను వీరికి అందజేశారు.

పారిజాతగిరిలో శాశ్వత అన్నదానానికి విరాళం



పారిజాతగిరిలో విరాళం అందజేస్తున్న దాత హర్షిద్ రాహుల్

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ మొదలుకుని ఆరాధన, బాలభోగం, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి తదితర పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గుడిపూడి సత్యనారాయణ, వెంకటనాగమణి దంపతులు, వారి కుమారుడు హర్షిద్ రాహుల్ శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,232 విరాళం అందజేశారు. ఆలయ కార్యానిర్వహణాధికారి మానికల రాంబాబుకు ఈ మొత్తాన్ని అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు వేదపండితులు ఆశీస్సులు శ్రీస్వామివారి సేవావస్త్రాలు ప్రసాదాలతో సన్మానించారు.

నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



దాత అల్లూరి రామకృష్ణ కుటుంబసభ్యులను అమ్మవారి చిత్రపటంతో సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి అల్లూరి రామచంద్రరావు, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం అల్లూరి రామకృష్ణ, కుటుంబ సభ్యులు రూ 1,51,116 విలువైన స్టెయిన్ లెస్ స్టీల్‌గేట్లు తయారు చేయించి అందజేశారు. తొలుత ఆలయంలో అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం, దాత కుటుంబ సభ్యులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి శేషవస్త్రాలు ప్రసాదం, చిత్రపటాన్ని అందించి, వేదాశీర్వాదంతో సత్కరించారు.

మలాథియాన్ స్ప్రేయింగ్



మలాథియాన్ స్ప్రేయింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

టి.నసాపురం: బొర్రంపాలెం గ్రామంలో పెండ్యాల అభిషేక్ బాబు యూత్ ఆధ్వర్యంలో శనివారం మలాథియాన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఇటీవల కాలంలో దోమల బెడద ఎక్కువై ప్రజలు అనారోగ్యానికి గురవుతుండటంతో, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు కుమారుడు పెండ్యాల అభిషేక్ బాబు స్పందించి తన సొంత వ్యయంతో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి
- చింతలపూడి పార్టీ ఇన్‌చార్జి విజయరాజు



చక్రదేవరపల్లిలో పార్టీ శ్రేణులను పరిచయం చేసుకుంటున్న కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గం ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. శనివారం మండలంలోని చక్రదేవరపల్లి, వేగవరం, తాడువాయి, చల్లవారిగూడెం, మైసన్నగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను విజయరాజు కలుసుకుని పరిచయం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేగవరం, తాడువాయి గ్రామాల్లో అర్హులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సచివాలయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనను నియోజకవర్గ ప్రజలంతా ఆశీర్వదించి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి మండవల్లి సోంబాబు, పార్టీ నాయకులు రాఘవరాజు ఆదివిష్ణు, కొలనువాడ సాయిరాజు, నులకాని సూర్యచంద్రరావు, నులకాని వీరాస్వామి నాయుడు, చిట్యాల చంద్రరావు, కనికళ్ల ప్రసాద్‌బాబు, జి.పార్థసారధి, మద్ది ధర్మకర్తలు మళ్ళీడి బాబి, జెట్టి దుర్గమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సాసీపీ నాయకులు పాల్గొన్నారు.

5న ఆసీల వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో రోజువారీ మార్కెట్, వీక్లీమార్కెట్, జంతు వధశాలల ఆశీలు వసూలు హక్కు నిమిత్తం ఫిబ్రవరి 5న వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఒక సంవత్సరకానికి గాను గుత్తేదారునికి హక్కులు ఇచ్చేందుకు ఫిబ్రవరి 5వ తేదీ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రంలోగా ధరావతు సొమ్ము డీడీ రూపంలో, సాల్వెన్సీలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రాథమిక హక్కుల గురించి తెలుసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు



గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కుల గురించి చదువుకునే రోజుల నుంచే విద్యార్థులు తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. స్థానిక హయగ్రీవ విద్యాసంస్థల ఆవరణలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలు, బాల కార్మిక నిర్మూలనా చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, నిర్బంధ విద్యాచట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటితో పాటు ర్యాగింగ్ నిరోధక చట్టం, ట్రాఫిక్ ఉల్లంఘన చట్టాలను గురించి అవగాహన కలిగించారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిణి మాధవి మాట్లాడుతూ ఒంటిపై ఎక్కడ ముట్టుకుంటే మంచి స్పర్శ, ఎక్కడ ముట్టుకుంటే చెడు స్పర్శ అనేది వివరించారు. తల్లిదండ్రులతో సహా బంధువులు, మిత్రులు కూడా తాకకూడని ప్రదేశాల్లో తాకితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా తాకకూడని ప్రదేశాల్లో తాకితే 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. 18 సంవత్సరాలలోపు యువత ప్రేమ పెళ్లిళ్లకు దూరంగా ఉండాలని పోక్సో చట్టం ద్వారా ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలకు కఠిన శిక్షలు పడతాయని న్యాయవాది కనక దుర్గ హెచ్చరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, న్యాయవాదులు ఉమర్ ఫరూఖ్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు



కుక్కునూరు అటవీశాఖ కార్యాలయం నుంచి రామసింగారం సెంటర్ వరకు ప్రారంభమైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

కుక్కునూరు: మండలవ్యాప్తంగా రూ.కోటితో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల మండలంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును స్థానికులు కలిసి రోడ్ల సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి వెంటనే కొత్త సీసీ రోడ్లను మంజూరు చేయించారు. అంతేకాక రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించి వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కొత్త సీసీ రోడ్ల నిర్మాణ పనుల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన

కొయ్యలగూడెం: రోటరీ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు సోషల్ వర్కర్ మొడియం సూర్యచంద్రరావు అన్నసమారాధన నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ శర్మ, గొలిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూమిలో సర్వే నిర్వహిస్తే అడ్డుకుంటాం’



గ్రామసభలో భూమి సమస్యను వివరిస్తున్న గ్రామ సర్పంచ్ రవిబాబు, గ్రామస్తులు

లింగపాలెం: కలరాయునగూడెంలో శనివారం నిర్వహిస్తున్న గ్రామసభలో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో సర్వే నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ భూమిని సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, వేరే ఎవ్వరికీ ఇవ్వడం సరికాదని అన్నారు. ఈమేరకు గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత చలగుళ్ల రవిబాబు, గ్రామస్తులు తహసీల్దార్ మురళీకృష్ణ, ఫారెస్ట్ డీఆర్వో కె రామలింగాచార్యులు, ఏఎస్సై రాంబాబులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సభలో సర్పంచ్ రవిబాబు, ఎస్సీ నాయకులు చొక్కా ఇస్తయ్య మాట్లాడుతూ గ్రామంలో ఆర్‌ఎస్ నెం 269లో 1,290 ఎకరాల భూమి గతంలో ఎస్టేట్ భూమిగా, ప్రస్తుతం ప్రభుత్వ పోరంబోకు భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదై ఉందన్నారు. ఈ భూమిలో గత నాలుగు తరాలుగా గ్రామానికి చెందిన ఎటువంటి ఆధారంలేని నిరుపేదలు సుమారు 600 మంది వర్షాధార పంటలు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ తరుణంలో ఈభూమిని పొరుగు గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన గుత్తా సత్యన్నారాయణ అనే వ్యక్తి ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని, ఇందుకు కొందరు అధికారులు కొమ్ముకాస్తున్నారని, ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ చెప్పారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లతామని తెలిపారు.

అంగన్‌వాడీ సిబ్బందిపై యూనియన్ నేతల జులుం!

- ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా విధుల్లో చేరారని కక్షపూరిత చర్యలు
- ఫోన్ చేసి బెదిరింపులు

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ సిబ్బందిపై యూనియన్ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. తమ మాటను కాదని విధుల్లో హాజరైనందుకు మీకు తిప్పలు తప్పవంటూ వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల అంగన్‌వాడీ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం నిరసన దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు నెలరోజుల దీక్షల అనంతరం ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో కొందరు ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఇది రుచించని యూనియన్ నాయకులు కొందరు విధులకు హాజరైనవారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని పలు అంగన్‌వాడీ ప్రాజెక్టుల సిబ్బంది వాపోతున్నారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లోని కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, గోపాలపురం ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలోనీ పలు సెక్టార్లకు చెందిన సిబ్బంది నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో పాటు మరికొన్ని షరతులపై ప్రభుత్వం నిర్ణయాత్మక వైఖరి అవలంబించింది. ఈ నేపథ్యంలో తక్షణమే విధులకు హాజరు కావాలని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తామంటూ అల్టిమేటం జారీ చేసింది. అనంతరం 90 శాతానికి మందికి పైగా అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరై తమ బాధ్యతలు కొనసాగిస్తున్నారు. అయితే.. యూనియన్ నాయకుల పేరుతో తమ సంస్థకు చెందిన ఉద్యోగులే బెదిరిస్తున్నారని, మీ సెంటర్లలో ఉన్న అవకతవకలు బయటపెడతామంటూ భయపెడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగానే వారు తమ అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యతిరేక చర్యలకు పాల్పడే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు ఈ విషయంలో తమకు సహకరించాలని వారు కోరుతున్నారు.

నాణ్యత, శుభ్రత లేకుంటే చర్యలు



జంగారెడ్డిగూడెంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఆహార భద్రతా అధికారులు

జంగారెడ్డిగూడెం: ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారులు కావ్యరెడ్డి, రామరాజు హెచ్చరించారు. శనివారం జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు హోటల్స్, రెస్టారెంట్, స్వీట్ స్టాల్స్ దుకాణాల్లో ఆహార భద్రత అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. స్థానిక న్యూ భక్తాంజనేయ స్వీట్స్ అండ్ బేకరీ, శ్రీ అంబికా ఫ్యామిలీ రెస్టారెంట్ రాజు ఫుడ్‌కోర్ట్, బామ్మ రెస్టారెంట్, కాజా పంతులు హోటల్, సాయిబాలాజీ ఎంటర్‌ప్రైజెస్, జేబీ గ్రాండ్ రెస్టారెంట్లలో తనిఖీలు చేసి బూందీ లడ్డు, చికెన్ ఫ్రై చికెన్ బిర్యానీ, మినప గుండ్లు, బన్సీరవ్వ, కందిపప్పు, పెసరపప్పు, వేరుశెనగ మైదాపిండి మొత్తం 10 రకాలైన శ్యాంపుల్స్ సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించామన్నారు. మరో 15 రోజుల్లో ల్యాబ్ రిపోర్టును బట్టి చర్యలు ఉంటాయన్నారు. అలాగే హోటళ్లలో గుర్తించిన కలర్ పౌడర్లను ధ్వంసం చేశామన్నారు. ఆహార పదార్థాల విషయంలో ఎటువంటి ఫిర్యాదులు చేయాలన్నా జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఎం.శ్రీనివాసరావు ఫోన్: 98483 16338కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే హోటల్స్, రెస్టారెంట్ నిర్వాహకులు నాణ్యతతో ఆహార పదార్థాలను తయారు చేయాలని, వంటశాల పరిశుభ్రంగా ఉండాలని, మిగులు పదార్థాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచవద్దని, నిబంధన తప్పనిసరిగా పాటించాలని కోరారు.

నరసన్నపాలెంలో వైద్యశిబిరం



నరసన్నపాలెం గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లింగపాలెం: నరసన్నపాలెంలో ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్, అయోక ఫార్మాసిటికల్స్ ముంబై వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జ్యుడిషియల్ మెంబర్, ఎన్సీఎల్టీ ముంబై బెంచ్ వి.కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలు సమాజసేవలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి గ్రామాల్లో సంస్థలు అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరసన్నపాలెం, రంగాపురం సర్పంచ్‌లు కె రత్తయ్య, ముసునూరి రాము, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, డాక్టర్లు ఎస్ఎంఎ అహ్మద్, బి.నిర్మలాదేవి, వసుధ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సీఎండీ రామాకోటేశ్వరరావు, అయోక ఫార్మాసిటికల్స్, ముంబై ఎండీ ప్రహ్లద్‌సతి, డాక్టర్ వరప్రసాదరావు, సిబ్బంది బి.వెంకటేశ్వర్లు, బి.రామ్‌లాల్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి సీఐగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



చింతలపూడి: చింతలపూడి సీఐగా ఎం.సుధాకర్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ట్రాఫిక్ సీఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఆయన భీమడోలు ఎస్సైగా, జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. కోడిపందేలు, పేకాట జూదాలపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రజలు కూడా నేరాల అదుపుకు సహకరించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆ ప్రచారంలో నిజం లేదు



ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీలో తాను క్రమశిక్షణ గల నాయకుడిగా ఉన్నానని తాడేపల్లిగూడెం మార్కెట్‌యార్డు చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని, ఆయన నాయకత్వంలోనే కొనసాగుతానని చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఇటీవల సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. శనివారం ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడలు



కేఆర్‌పురం ఐటీడీఏలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలు



షటిల్‌లో గెలుపొందిన బుట్టాయగూడెం మహిళా విభాగం టీమ్

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఎంపిక చేసి ఇక్కడ నియోజకవర్గ స్థాయిలో క్రీడలను నిర్వహిస్తున్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన షటిల్ మహిళా విభాగంలో బుట్టాయగూడెం మండలానికి చెందిన టీమ్ గెలుపొంది జిల్లాకు ఎంపికైనట్లు పీడీలు తెలిపారు.

కర్పూరీ ఠాకూర్‌కు ఘన నివాళి



కొయ్యలగూడెంలో కర్పూరీ ఠాకూర్‌కు నివాళి అర్పిస్తున్న నాయీ బ్రాహ్మణులు

కొయ్యలగూడెం: ‘జన నాయక్’గా ప్రసిద్ధి పొందిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ జీవితం అందరికీ ఆదర్శం అని నాయీ బ్రాహ్మణులు పేర్కొన్నారు. ఆయన్ను భారతరత్న అవార్డుకు ఎంపిక చేసిన సందర్భంగా కొయ్యలగూడెంలో నాయీ బ్రాహ్మణులు ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కర్పూరీజీ శత జయంతిని పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను ప్రచారం చేయాలని సంకల్పించారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించాలని సంఘ నాయకులు యువతను కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మడుతూరి బ్రదర్స్, పంచాయతీ వార్డు సభ్యుడు సూదికొండల శివాజీ గణేష్, అరిగెల వినోద్, వినయ్, చిన్నయ్య, మణికంఠ, వెంకటేశ్వరరావు, అమ్మిరాజు నాయీ బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

28 నుంచి అండర్ -19 పోటీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో 67వ రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల, బాలికల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



సూర్యకళ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పిస్తున్న విజయరాజు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన బోడ ఆనంద్ సతీమణి మాణిక్య సూర్యకళ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆనంద్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. సూర్యకళ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆనంద్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దెకనాల రాంబాబు, మేడవరపు విద్యాసాగర్, వందనపు వెంకటేశ్వరరావు, వంటిపల్లి సీతారామస్వామి, గూఢపాటి రాధాకృష్ణ, కేమిశెట్టి మల్లిబాబు, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, నేకూరి కిషోర్ తదితరులు సూర్యకళ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కొయ్యలగూడెం ఇరిగేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ భరత ఖండానికే గర్వకారణం అని గోదావరి డెల్టా సిస్టం (ధవళేశ్వరం) చీఫ్ ఇంజనీర్ రేపు సతీష్‌కుమార్ పేర్కొన్నారు. కన్నాపురం రోడ్డులోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రవీంద్రబాబు ఆధ్వర్యంలో శనివారం భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏలూరు పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ చిలకపాటి దేవిప్రకాష్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జేపీసీ చైర్మన్ చోటగిరి శ్రీనివాసరావు, ముఖ్య అతిథులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఈ చదలవాడ భాస్కరరావు, కారంకి శ్రీనివాస్, పెన్మెత్స శ్రీనివాస రాజు, గిరిజాల రామకృష్ణ, పిండింటి రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: ఏఐకేఎంఎస్ (చంద్రన్నవర్గం) 10వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు తలారి ప్రకాష్ కోరారు. మహాసభల పోస్టర్‌ను మండలంలోని కోపల్లిలో శనివారం ఆ సంఘ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3, 4 తేదీల్లో గుంటూరు జిల్లా గురజాలలో ఈ సభలు జరుగుతాయని చెప్పారు. ఫిబ్రవరి 3న బహిరంగ సభ, 4వ తేదీన ప్రతినిధుల సభలు జరుగుతాయని చెప్పారు. ఈ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎలక్ట్రికల్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అందించాలి

జంగారెడ్డిగూడెం: ఎలక్ట్రికల్ వర్కర్లకు, ప్లంబర్లకు, మెకానిక్ వర్కర్లకు ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కట్టాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ధర్మన్న స్మారక భవనం వద్ద జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ప్లంబర్స్ మెకానిక్ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షుడు బాలిన ధర్మరాజు ఎగరవేశారు. కార్యక్రమంలో ఎరుబండి వీర్రాజు, గెద్దం రమేష్, వనపర్ల నవీన్, ఏంఎల్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

చింతలపూడి: చింతలపూడి మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాఘవాపురం గ్రామంలో జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవరపల్లి అరోన్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా డి నోవాహు, ఎస్‌కే వలి, సహాయ కార్యదర్శులుగా కె.కుమార్, ఎస్ పవన్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. సమష్టిగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు.